తిరుచెందూరు ఆలయంలో

నేడు శూరసంహార వైభవం



తిరుచెందూరు సముద్రతీరంలో భక్తుల రద్దీ

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు సెంథిల్‌నాధన్ ఆండవర్ ఆలయంలో సోమవారం సాయంత్రం సముద్ర తీరంలో శూర సంహార వేడుకలు అత్యంత వైభవంగా జరుగున్నాయి. తమిళుల ఆరాధ్య దైవం కుమారస్వామి ఆలయాల్లో ప్రతియేటా స్కందషష్ఠి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టంగా శూరసంహార వేడుక, తిరుకల్యాణోత్సవం భారీ స్థాయిలో చేస్తారు. తిరుత్తణి ఆలయం మినహా కుమార స్వామి కొలువైన అన్ని క్షేత్రాల్లో శూర సంహార వేడుకలకు తగు సన్నాహాలు చేపడుతున్నారు. అయితే తిరుచెందూరు ఆలయం వద్ద జరిగే శూరసంహార వేడుకలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. సముద్రతీరంలో జరిగే ఈ వేడుకలకు దేశవిదేశాల నుంచి లక్షలాదిమంది భక్తులు వస్తారు. ఈ నేపథ్యంలో తిరుచెందూరు ఆలయంలో శూరసంహార వేడుకలకు నాందిగా ఆదివారం వేకువజాము మూడు గంటలకు ఆలయాన్ని తెరిచారు. 3.30 గంటలకు విశ్వరూప దర్శనం, నాలుగు గంటలకు ఉదయమార్తాండాభిషేకం, తొమ్మిది గంటలకు ఉచ్చికాల అభిషేకం, దీపారాధన జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు యాగశాలలో దీపారాధన అనంతరం జయంతినాథుడు వళ్ళి, దైవానై సమేతుడై స్వర్ణసప్పరంలో బయలుదేరి షణ్ముఖవిలాస మండపానికి వేంచేశారు. అక్కడ స్వామివారికి శైవపండితులు మహాదీపారాధన చేశారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు జయంతి నాథుడు (కుమారస్వామి) శూర సంహారం చేసేందుకు సముద్రతీరానికి బయలు దేరి వెళ్తారు. లక్షలాది మంది భక్తజనం నడుమ శూరపద్ముడికి, స్వామివారికి మధ్య భీకర సంగ్రామం జరుగుతుంది. చివరకు ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులిచ్చిన ప్రత్యేక శూలాయుధాన్ని జయంతినాథుడు ప్రయోగించడంతో వృక్షంగా మారిన శూరపద్ముడి దేహం రెండు ముక్కలై ఓ ముక్క కోడి పుంజుగా, రెండో ముక్క నెమలిగాను మారుతాయి. స్వామివారి విజయ పతాకంలో కోడిపుంజు చిహ్నం గా, మయూరం స్వామివారి వాహనం గా మారాయి. ఇలా శూరపద్మడికి స్వామివారు మోక్ష ప్రాప్తినందించే ఘట్టాలను ఆలయ అర్చకులు, శైవభక్తులు ఇరువర్గాలుగా ఏర్ప డి ప్రదర్శిస్తారు. శూరసంహారం ముగిసిన తర్వాత స్వామి, అమ్మవార్లకు సంతోష మండపంలో ప్రత్యేక అభిషేక అలం కారాలు జరుగుతాయి. రాత్రి 10 గంటలకు మహాదేవుడి సన్నిధి ముందు స్వామికి ఛాయాభిషేకం నిర్వహించి, షష్ఠిపూజ రేకు ప్రతిష్ఠించనున్నారు. మంగళవారం స్వామి అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం జరుగుతుంది. శూరసంహార వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు అరుళ్‌మురుగన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ రాము, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపడుతున్నారు. సుమారు 4 వేలమంది పోలీసులతో ఐదెంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. శూరసంహారం జరిగే సముద్రతీర ప్రాంతం వద్ద 10 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేడుకలను భక్తులు తిలకించడానికి వీలుగా పదిచోట్ల భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

తప్పిన 'మొంథా' ముప్పు

● భారీ వర్షాలకు అవకాశం

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం సోమవారం 'మొంథా' తుఫానుగా బలపడినా నగరానికి ఎలాంటి నష్టం జరగదని, అదే సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. ఆగ్నేయ బం గాళాఖాతంలో రెండు రోజుల క్రితం కేంద్రీకృతమైన అల్పపీడనం శనివారం గంటకు 8 కి.మీ. వేగంతో పశ్చిమ వాయువ్యదిశగా కదలి వాయుగుండంగా బలపడింది. చెన్నైకి తూర్పు దిశగా ఆగ్నేయంలో 780 కి.మీ.ల దూరంలోను, విశాఖపట్టణానికి ఆగ్రేయంగా 830 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం ఆదివారం మధ్యాహ్నం నుండి గంటకు 6 కి.మీ.ల వేగంతో కదలసాగింది. సోమవారం ఉదయం వాయుగుండం 'మొంథా' తుఫానుగా మారి మధ్యాహ్నం చెన్నై నుంచి ఆంధ్రాతీరం వైపు కదులుతుందని అధికారులు తెలిపారు. ఈ నెల 28 రాత్రి మచిలీ పట్నం - కళింగపట్నం మధ్య తీరం దాటుతుందని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.



మైలాపూరు లోని ఓ ప్రైవేటు పాఠశాలలో వర్షబాధితులను ఆదుకునేందుకు సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న అగ్నిమాపక సిబ్బంది

తుఫాను ప్రభావంతో చెన్నై, తిరువళ్లూరు, రాణిపేట జిల్లా ల్లో భారీ వర్షాలు. కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు

● కాకలూరు-పోదటూర్‌పేటలో కూలిన ఇళ్లు

తిరుత్తణి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తిరుత్తణి, పళ్లిపట్టు, తిరువలంగాడు సహా పలు గ్రామాలు జలమయమయ్యాయి. కాకలూరు-పోదటూర్‌పేట ప్రాంతాల్లోని ఐదిళ్ల పైకప్పు, ప్రహరీగోడలు, మరో ఇల్లు పూర్తిస్థాయిలో కుప్పకూలాయి. కూలిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. దీనిపై బాధితులు అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆదివారం ఉదయం పొదటూర్ పేట ఆర్ఐ రవికుమార్, గ్రామాధికారులతో కలిసి కూలిన ఇళ్లను పరిశీలించి, బాధితుల వివరాల నివేదికను పొదటూర్‌పేట చీఫ్ అధికారికి అందిజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

హైకోర్టు నూతన భవన సముదాయం ప్రారంభోత్సవం



భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని న్యాయ కళాశాల సమీపంలో ఆరు అదనపు న్యాయస్థానాలకు సంబంధించిన భవన సముదాయాన్ని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తి సూర్యకాంత్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ భవనసముదాయాన్ని ప్రస్తుతమున్న హైకోర్టు భవనాలను తలపిస్తు వారసత్వ భవనంలా నిర్మించటం విశేషం. ఈ భవన సముదాయ ప్రారంభోత్సవంలో కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆర్.మహదేవన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఎం. శ్రీవత్సవా, హైకోర్టు పారంపర్య కట్టడ నిర్మాణ కమిటీ అధ్యక్షులు జస్టిస్ ఆర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

6

● కరూర్ దుర్ఘటన..

టీవీకే నేతలపై సీబీఐ కేసు నమోదు

7

తిరువిక నగర్‌లో రూ.42.60 కోట్లతో అభివృద్ధి పనులు

పరిశీలించిన మంత్రి శేఖర్‌బాబు

మహిళలు, మైనారిటీ ఓటర్ల తొలగింపునకు

బీజేపీ కుట్ర

● సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం సాయంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓటర్ల జాబితాలోని మహిళలు, మైనారిటీల ఓటర్లను తొలగించి అక్రమంగా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని కుట్రపన్నుతోందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ శ్రేణులు ఓ లేఖ రాశారు. త్వరలో ఎన్నికల సంఘం జరుపనున్న ఓటర్ల జాబితా సవరణపై పార్టీ స్థానిక శాఖల నాయకులు,, ఆయా పోలింగ్ బూత్‌ల ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని, స్థానిక అధికారుల సవరణలపై అవసరమయితే నిఘా వేయాలని కూడా సూచించారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా ఈశాన్యరుతుపవన ప్రభావంతో పాటు బంగాళాఖాతంలో అల్పపీడనాల కారణంగా భారీగా వర్షాలు కురిసి పంట నష్టాలు, ఆస్తినష్టాలు అధికమవుతున్నాయని, ఇలాంటి సమయంలో బాధితులను ఆదుకోవటం పార్టీ శ్రేణుల ప్రధాన కర్తవ్యమని, అదే సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం జరుపనున్న ఓటర్ల జాబితా సవరణ పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెండు రోజులుగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో పాటు రాష్ట్ర మంతులంతా వర్షబాధిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి బాధితులను పరామర్శించటమే కాకుండా సహాయాలు కూడా అందజేస్తున్నారని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ పనులపై కూడా దృష్టిసారించి క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా ఎలాంటి తప్పులు జరగకుండా జాగత్త వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఇటీవల ఏకతాటిపై తమిళనాడు పేరుతో డీఎంకే నాయకులు, ప్రముఖులంతా 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ సభ్యత్వ కార్యక్రమాలను విరివిగా చేపట్టారని, ఆ కార్యక్రమాలు విజయవంతం కావటానికి పార్టీ శ్రేణుల కృషి చేశారని కొనియాడారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం జరుపనున్న ఓటర్ల జాబితా సవరణ పనులపై నిఘా వేసి,, ఏవైనా తప్పిదాలు జరిగితే పార్టీ జిల్లా నాయకులకు, అధిష్టానానికి ఫిర్యాదులు చేయాలని స్టాలిన్ ఆ సుదీర్ఘ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రెండ్రోజుల్లో పూర్తి చేయండి

అడయార్ నది ముఖద్వారం విస్తరణ పనులు పరిశీలించి, అధికారులకు సీఎం ఆదేశం



పనులను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌నది ముఖ ద్వారం విస్తరణ పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం పరిశీలించి రెండ్రోజుల్లో పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈశాన్య రుతుపవనాల ఆగమనంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా తిరువారూర్, తెన్‌కాశి, విరుదునగర్, రామనాథపురం, కోవై, నీలగిరి, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, మైలాడుదురై, నాగ పట్నం, తంజావూరు జిల్లాల్లో సహాయక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. శుక్రవారం శ్రీనివాసపురం సమీపంలో ఉన్న అడయార్ నదీ తీరాన్ని మంత్రులతో కలిసి సీఎం స్టాలిన్ పరిశీలించారు. ఈ ముఖ ద్వారాన్ని సుమారు 200 మీటర్ల మేర వెడల్పు చేసే పనులు చేపట్టారు. మళ్లీ రెండోసారి ఆదివారం ఉదయం సీఎం స్టాలిన్ అడయార్ నది ముఖద్వారాన్ని పరిశీలించి విస్తరణ పనులను వేగవంతం చేసి రెండు రోజుల్లో పూర్తిచేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

వరిలో తేమ శాతంపై

కేంద్రానికి నివేదిక

● తంజావూరులో కేంద్ర బృందం అధికారి పీకే సింగ్



తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి తేమశాతంపై నివేదిక తయారుచేసి కేంద్రప్రభుత్వానికి అందజేయనున్నట్లు పంజాబ్ రాష్ట్రం లూధియానా లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్రీన్ స్టోరేజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ పీకే సింగ్ పేర్కొన్నారు. ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1719 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 9.67 లక్షల ధాన్యం కొనుగోలు చేశాయి. ఈ నేపథ్యంలో వర్షాలతో పలు జిల్లాల్లో కోతకు సిద్ధంగా పంటతో పాటు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం బస్తాలు నీటమునగడంతో అన్నదాతలు ఆందోళనకు గురైయ్యారు. వారి సమస్యలపై దృష్టిసారించిన సీఎం స్టాలిన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖరాశారు. అందులో వరిలో తేమశాతాన్ని 17 నుంచి 22కు పెంచాలని, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసేం దుకు కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపించాలని కోరారు. దీనిపై స్పందించి ఏర్పాటు చేసిన మూడు బృందాలను కేంద్ర ఆహారశాఖ రాష్ట్రానికి పంపింది. ఆ ప్రకారం మూడు కేంద్ర బృందాలు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్నాయి. ఇందులో భాగంగా రెండో బృందానికి సారథ్యం వహిస్తున్న పీకే సింగ్, సాంకేతిక అధికారులు షోబిత్ శివాచ్, రాకేష్ బర్మా, తమిళనాడు పౌరసరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్ అన్నాదురై, జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం సహా పలువురు అధికారులు ఆదివారం తంజావూరు సమీపంలోని ఆలక్కుడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలోని ధాన్యం నమూనాలను సేకరించారు. ఈ కేంద్ర బృందంతో రైతులు తమగోడు వినిపించారు. ప్రతి సంవత్సరం సాగుచేసిన వరిపంట కోత సమయానికి వర్షార్పణం అవుతోందని, ఇందువల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నట్లు ఏకరువు పెట్టారు. జరిగిన పంట నష్టంపై త్వరిత గతిన నివేదిక తయారుచేసి కేంద్రప్రభుత్వానికి సమర్పించి తమను ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తిచేశారు. అక్కడినుండి అధికారుల బృందం జిల్లాలోని రారాముద్రకోట, కీల్‌కోవిల్‌పత్తు తదితర ప్రాంతాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను కూడా పరిశీలించింది. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న కేంద్ర బృందం అధికారి పీకే సింగ్ తడిసిన ధాన్యం గురించి రైతులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, తేమశాతంపై కేంద్రానికి పర్యటన ముగిసిన మరుసటిరోజే నివేదిక సమర్పించనున్నట్లు హామీ ఇచ్చారు.

సమాజ సంస్కరణే

జాషువా జీవిత ధ్యేయం

● వేద విజ్ఞానవేదిక సభలో బొగ్గరపు రాధాకృష్ణమూర్తి



వక్త రాధాకృష్ణమూర్తిని సత్కరిస్తున్న వేద విజ్ఞానవేదిక నిర్వాహకులు

వేళచ్చేరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా జీవిత ధ్యేయం సమాజ సంస్కరణేనని నెల్లూరుకు చెందిన ఆధ్యాత్మిక సాహిత్య ఉపన్యాసకులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. నగరంలో ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఆదివారం సాయంత్రం 'వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 166వ ప్రసంగ కార్యక్రమంలో భాగంగా 'విశ్వనరుడు - గుర్రం జాషువా' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ప్రారం భమైన ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు వక్తను, ప్రముఖులను వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం వేదవిజ్ఞాన వేదిక కార్యక్రమాలను సభకు వివరించారు. జేకే.రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా కనిగిరిలో జన్మించిన వక్త బొగ్గరపు రాధాకృష్ణమూర్తి ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీవిరమణ చేశారు. ప్రముఖ కవులైన శ్రీశ్రీ, ఆరుద్ర తదితరులతో ప్రత్యక్ష పరిచయం కలిగిన ఆయన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో స్వీయ కవితలు వినిపించారు. శ్రీశ్రీ, కవిమిత్ర తదితర పురస్కారాలను అందుకున్నారు. 50యేళ్లుగా రచనలు చేసిన ఆయన టీటీడీ ధర్మప్రచార సభల్లో పలు ఉపన్యాసాలు చేశారు. అంతకుముందు ఆస్కా మేనేజింగ్ ట్రస్టీ కోటారెడ్డిని వేదవిజ్ఞాన వేదిక నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం వక్తను నూతన వస్త్రాలతో, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సభలో జాషువా మనవడు చిననాగూరు కూడా పాల్గొన్నారు. వక్త రాధాకృష్ణమూర్తి ప్రసంగంలో.. కులమతాలు సంకెళ్లుగా ఉన్న ఆనాటి సమాజంలో జాషువా తనకు కుల,మత భేదాలు లేవని, తాను విశ్వనరుడినని ప్రకటించుకున్నారు. జాషువా తనకు ఇద్దరు గురువులని ఒకరు పేదరికం, మరొకరు కులమత భేదాలు అని స్వయంగా తెలిపారని, కలం అనే కత్తితో రెండింటిని ఎదుర్కొని విజయం సాధించారని తెలిపారు. కుటుంబం, సమాజం, దేశం అన్నింటా పవిత్ర ప్రేమ ఉండాలని జాషువా భావించారన్నారు. 'విశ్వమందు గల ప్రేమ సర్వస్వంబు' అంటూ దానిని ముద్దుగా చేసి హృదయాలను తయారుచేయాలనే జాషువా భావించి, తన రచనలో వాటిని వ్యక్తం చేశారన్నారు. జాషువా రచనల్లోని గొప్ప సందేశాన్ని క్లుప్తంగా వివరించానని రాధాకృష్ణమూర్తి తెలిపారు. వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి మధు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

మహాబలిపురానికి కరూర్ మృతుల కుటుంబీకులు

● నేడు పరామర్శించనున్న విజయ్



కరూర్‌లో టీవీకే ఏర్పాటు చేసిన బస్సెక్కుతున్న మృతుల కుటుంబీకులు

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే నేత విజయ్ రోడ్‌షో సందర్భంగా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది మృతుల కుటుంబీకులు, గాయపడినవారు ఆదివారం మధ్యాహ్నం ఐదు ఆమ్నీ బస్సుల్లో చెన్నై బయలుదేరారు. కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో విజయ్ మృతుల కుటుంబీకులకు వారిళ్లకే వెళ్ళి పరామర్శించి తలా రూ.20లక్షల ఆర్థికసాయం చేయాలని భావించారు. అయితే కరూర్ వెళ్తే శాంతి భద్రతల సమస్యలు ఏర్పడతాయని భావించి దానికి స్వస్తి చెప్పారు. ఆ నేపథ్యంలో మహాబలిపురంలోని ఓ స్టార్ హోటల్ ప్రాంగణం వద్ద మృతుల కుటుంబ సభ్యులను పిలిపించి వారిని పరామర్శించాలని విజయ్ నిర్ణయించారు. అదే సమయంలో గాయపడినవారికి తలా రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని కూడా అందించనున్నారు. మృతుల కుటుంబీకులకు ప్రకటించిన రూ.20లక్షలను ఇటీవలే వారి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఈ నేపథ్యంలో కరూర్‌నుండి ఐదు ఆమ్నీ బస్సుల్లో కరూర్ దుర్ఘటన మృతుల కుటుంబీకులు నగరానికి బయలుదేరారు. ముందు కరూర్‌లోని వెన్నమలై బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద బస్సులను ఆపి ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత బస్సులు బయలుదేరాయి. భద్రతా దృష్ట్యా ఈ బస్సుల వెనుక అంబులెన్స్ కూడా బయలుదేరింది. సోమవారం ఉదయం టీవీకే నేత విజయ్, పార్టీ ప్రముఖులు మహాబలిపురం వెళ్ళి కరూర్ దుర్ఘటనలో మృతి చెందినవారి కుటుంబీకులను పరామర్శించనున్నారు. ఇదిలా ఉండగా మరికొంతమంది మృతుల కుటుంబీకులను సోమవారం ఉదయం విమానంలో నగరానికి తీసుకువచ్చేందుకు కూడా పార్టీ ప్రముఖులు ప్రయత్నిస్తున్నారు.

పంట నష్టం పట్టించుకోకుండా

సినిమాలు చూస్తారా?

● సీఎం స్టాలిన్‌పై ఈపీఎస్ ధ్వజం



అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంట నష్టాన్ని పట్టించుకోకుండా సినిమాలు చూస్తారా? అని ముఖ్యమంత్రి స్టాలిన్‌పై మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. వరిసాగు అధికంగా ఉన్న డెల్టా జిల్లాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న సంబా వరి నీటముని గింది. మరోవైపు మార్కెటింగ్ కమిటీలకు తరలించిన ధాన్యం కొనుగోలులో ఏర్పడిన జాప్యం కారణంగా వాటిని రోడ్డు పక్కనే పెట్టి రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈపీఎస్ శనివారం తంజావూరు, తిరువారూర్ సహా డెల్టా జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీటిలో తడిసి మొలకలెత్తిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం తన ఎక్స్‌పేజీలో డీఎంకే ప్రభుత్వ వైఖరిపై విమర్శలు గుప్పించారు. రైతులు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో పొందిన రుణాలతో సాగుచేసిన ధాన్యాన్ని వర్షాలకు ముందే కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహించారని, ఆరుగాలం శ్రమంచి పండించిన పంట నీటిపాలు కావడంతో రైతుల కష్టాలను పట్టించుకోవట్లేదని విమర్శించారు. రైతులు అధికంగా నష్టపోయిన డెల్టా జిల్లాల్లో పర్యటించాల్సిన ముఖ్యమంత్రి స్టాలిన్ సినిమాలు చూడడంలోనూ, ప్రతిభ కలిగిన సినిమా బృందాలను అభినందించడంలో శ్రద్ధ చూపుతున్నారని, బాధ్యత గల ముఖ్యమంత్రి ఇలా వ్యవహరించడం సబబేనా? అని ఈపీఎస్ మండిపడ్డారు. దక్షిణ తమిళనాడులో భారీస్థాయిలో వరదలు సంభవించిన సమయంలో పొత్తు గురించి మాట్లాడేందుకు ఢిల్లీ వెళ్లిన డీఎంకే నేతలకు రాష్ట్రప్రజల కష్టాలు తెలియవన్నారు. భారీవర్షాలకు ఇప్పటివరకు 31 మంది మృతిచెందారని, వారి కుటుంబాలను కూడా అధికార పార్టీ నేతలు పరామర్శించలేదని, ఈ నిర్లక్ష్యానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఈపీఎస్ వ్యాఖ్యానించారు.

మొలకెత్తిన పంట... ట్రాక్టర్‌తో దున్నించిన రైతు

6

మారి సినీ కెరీర్‌లో 'బైసన్' మరో వజ్రం

● సీఎం స్టాలిన్


ధ్రువ్, మారి సెల్వరాజ్‌ను అభినందిస్తున్న సీఎం స్టాలిన్

ధ్రువ్ విక్రమ్ హీరోగా రూపొందించిన 'బైసన్' మూవీ దర్శకుడు మారి సెల్వరాజ్ సినీ కెరీర్‌లో మరో వజ్రం వంటిదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కితాబిచ్చారు. శనివారం రాత్రి సీఎం స్టాలిన్‌ను దర్శకుడు మారి సెల్వరాజ్, చిత్ర హీరో ధ్రువ్ కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరినీ సీఎం అభినందించారు. ఆ సమయంలో ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు ఉదయనిధి కూడా ఉన్నారు. ఈ సమావేశంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'తన ప్రతిభను మాత్రమే నమ్ముకుని కబడ్డీలో ఏదో సాధించాలని తన గ్రామం నుంచి బయలుదేరి ఒక యువకుడు సమాజంలో తనకు ఎదురయ్యే అనేక సమస్యలను అధిగమించి విజయం సాధించే కథను మారి సెల్వరాజ్ తనదైన శైలిలో వెండితెరపై ఆవిష్కరించారు. మారి దర్శకత్వం వహించే ప్రతి సినిమాను నేను నిశితంగా గమనిస్తున్నాను. మారి రూపొందించే ప్రతి సినిమా ప్రేక్షకుల మనసుల్లో ఒక షార్ప్ మెసేజ్ (పదునైన సందేశం), ప్రభావాన్ని చూపించడంలో ఎన్నడూ విఫలం కాలేదు. అలాగే, యువత ఎంచుకోవాల్సిన మార్గం, ఎంతో పరిణితితో కూడిన రాజకీయాలను ఈ సినిమాలో చూపించారు. దర్శకుడి సినిమా భాష, కళాత్మకత మరింతగా మెరుగుపడేందుకు 'బైసన్' ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుంది. ఈ చిత్రంలో అత్యుత్తమ నటన ప్రదర్శించి, దర్శకుడి స్క్రీన్‌ప్లేకు ప్రాణం పోసిన ధ్రువ్, పశుపతి, అనుపమ, రజీషా విజయన్, ఈ సినిమా కోసం పనిచేసిన సాంకేతిక నిపుణులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఇలాంటి సినిమాలు మరిన్ని తమిళ చిత్రపరిశ్రమకు అందించాలని కోరుతూ మారి సెల్వరాజ్‌కు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు.

మా చిత్రాలనే ఎందుకు విమర్శిస్తున్నారు

● పా.రంజిత్


'బైసన్' సక్సెస్ మీట్‌లో పాల్గొన్న చిత్ర బృందం

తమిళ చిత్రపరిశ్రమలో యేడాదిలో 300కు పైగా చిత్రాలు వస్తున్నాయని, కానీ, తాను, వెట్రిమారన్, మారి సెల్వరాజ్ రూపొందించే చిత్రాలను మాత్రమే బూతద్దంలో చూస్తూ విమర్శలు చేస్తున్నారని దర్శక నిర్మాత పా.రంజిత్ ఆరోపించారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'బైసన్' మూవీ ఈ నెల 17వ తేదీన విడుదలై ప్రేక్షకాదారణ పొందింది. ఈ సినిమా సక్సెస్ వేడుకలను శనివారం నగరంలో నిర్వహించారు. ఇందులో ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన దర్శకుడు పా.రంజిత్ మాట్లాడుతూ, 'మారి సెల్వరాజ్, వెట్రిమారన్, నా చిత్రాలకు మాత్రమే అధికంగా విమర్శ చేస్తున్నారు? మా ముగ్గురినే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు' అని ప్రశ్నించారు. మూవీలో కీలక పాత్ర పోషించిన దర్శక నటుడు అమీర్ మాట్లాడుతూ, 'కంటికి తెలియని దైవం, దెయ్యాలను నేపథ్యంగా తీసుకుని సినిమాలు నిర్మించే వాటి విజయోత్సవ వేడుకలు జరుపుకుంటున్నారు. కానీ, కంటికి కనిపించే కులం, తద్వారా కలిగే బాధ ఆధారంగా చేసుకుని సినిమా తీయకూడదని ఎందుకు అంటున్నారు' అని ప్రశ్నించారు. చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'నా కళను, రాజకీయాలను వేలెత్తి చూపిస్తే మాత్రం మూర్ఖంగా పోరాటం చేస్తాను. నేను కుల అనుకూల సినిమా తీయలేదు. కుల వ్యతిరేకంపై సినిమా తీశాను. నా జీవితాన్ని ఒక కళగా మారుస్తున్నాను. నన్ను కూడా ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. అలాగే, హీరో ధ్రువ్, సంగీత దర్శకుడు నివాస్ కె.ప్రసన్న, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.


తండ్రి రజనీతో సౌందర్య


కమల్ హాసన్ - శ్రుతిహాసన్

ఆ ఇద్దరు గొప్ప నటులను
ఒకే స్క్రీన్‌పై చూస్తాం

● సౌందర్య - శ్రుతి హాసన్ వెల్లడి

ఇద్దరు గొప్ప నటులను ఒకే స్క్రీన్‌పై త్వరలోనే చూస్తామని సూపర్‌స్టార్ రజనీకాంత్ రెండో కుమార్తె సౌందర్య, ఉలగ నాయగన్ కమల్ హాసన్ కుమార్తె శ్రుతిహాసన్ వెల్లడించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెల్లడవుతుందని వారు పేర్కొన్నారు. భారతీయ చిత్రపరిశ్రమలో గొప్ప నటులుగా గుర్తింపు పొందిన సూపర్‌స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ సుదీర్ఘకాలం తర్వాత మళ్ళీ కలిసి నటించనున్నారని, యువ దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఆ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారనే ప్రచారం సాగుతోంది. అలాగే, రజనీతో కలిసి ఓ చిత్రంలో నటించనున్నట్టు కమల్ హాసన్ కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో సౌందర్య రజనీకాంత్, హీరోయిన్ శ్రుతి హాసన్ పాల్గొన్నారు. ఇందులో సౌందర్య మాట్లాడుతూ, 'తమిళ చిత్రపరిశ్రమలో రజనీ, కమల్ రెండు ధ్రువాలవంటివారు. వారిద్దరూ ఒక చిత్రం కోసం కలిసి పనిచేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టును ఎవరు డైరెక్ట్ చేస్తారన్నది తెలియలేదు. కానీ, ఈ ప్రాజెక్టుపై కదలికలు మొదలయ్యాయి. సరైన తరుణంలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడుతుందన్నారు. అలాగే, శృతి హాసన్ మాట్లాడుతూ, 'రజనీ, కమల్ మళ్ళీ వెండితెరపై ఒకటిగా చూడాలని అనుకుంటున్నాం. అందరిలాగే ఆ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. రజనీకాంత్ నటించిన చిత్రాల్లో 'పడయప్పా' బాగా నచ్చింది. ఆయన నటించిన 'కూలీ'లో నేను కూడా భాగస్వామి కావడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ ప్రాజెక్టును కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై తెరకెక్కనుంది.

'మెల్లిసై' ఫస్ట్‌లుక్ విడుదల

చిత్రజ్యోతి

హ్యాష్‌ట్యాగ్ ఎఫ్‌డీఎఫ్‌ఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై ధీరవ్ కథ సమకూర్చి దర్శకత్వం వహించిన ఫ్యామిలీ డ్రామా 'మెల్లిసై' చిత్ర ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ తాజాగా రిలీజ్ చేశారు. కంటెంట్ ఆధారిత సినిమాలకు ఎల్లవేళలా మద్దతిస్తూ ప్రోత్సహించే వెట్రిమారన్.. ఈ సినిమా ప్రమోషన్‌కు కూడా తన వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా చిత్రం ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేసిన ఆయన పోస్టరులోని అర్థాన్ని గ్రహించి చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఫస్ట్‌లుక్ పోస్టరులో కిషోర్ ఇంకా యువకుడిగానే కనిపిస్తున్నారు. 'ది యూనివర్స్ సీక్స్ ఫర్ లవ్' అనే ట్యాగ్‌లైన్ ఈ సినిమాకు అతికినట్టు సరిపోయింది. 'మెల్లిసై' చిత్ర బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. కాగా, ఈ చిత్రంలో జార్జ్ మరియన్, ఉత్తమన్, జస్వంత్ మణికంఠన్, ధనన్య, ప్రొక్టివ్ ప్రభాకర్, కన్నన్ భారతి తదితరులు నటించారు.


ఫస్ట్‌లుక్ రిలీజ్ చేస్తున్న వెట్రిమారన్


నూతన సొబగులతో 'తొల్‌కాప్పియర్ పూంగా'

● నగరవాసులను మైమరపిస్తున్న సింగపూర్ తరహా ఉద్యానవనం



కనువిందు చేస్తున్న రాతిబొమ్మలు

టి.నగర్, ఆంధ్రజ్యోతి

స్థానిక రాజా అన్నామలైపురంలో రూ.42.45 కోట్లతో సింగపూర్ తరహా పార్కును తలపించేలా పునర్నించిన 'తొల్‌కాప్పియర్ పూంగా' కొత్త అందాలను సంతరించుకుని నగరవాసులను ఆకట్టుకుంటోంది. చెన్నై నదుల మరమ్మతు ట్రస్టు ఆధ్వర్యంలో 58 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ ఉద్యానవనాన్ని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 2011లో ప్రారంభించారు. ఆ తరువాత కొద్ది మాసాలకే ఈ ఉద్యావనం నిర్లక్ష్యానికి గురై, దాదాపు పదేళ్లపాటు పర్యవేక్షణ కొదవై దుస్థితికి చేరింది. 2021లో డీఎంకే ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి రావటంతో ఈ ఉద్యావనాన్ని మరింత ఆకర్షణీయంగా పునర్నిర్మించే పనులు 2021 జూలైలో ప్రారంభమై ఈ యేడాది ఆగస్టులో పూర్తయ్యాయి. ఇటీవలే ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ ఉద్యానవనాన్ని ప్రారంభించారు.


ఇరువైపులా పచ్చదనంతో కూడిన వంతెన


విజిటర్స్ ఏరియా


వాకింగ్ ట్రాక్


సీతాకోక చిలుక జీవన దశలను తెలిపేలా..


వాచ్ టవర్


సందర్శకులు సేదతీరేందుకు నిర్మించిన గుడిసె


బైనాక్యులర్ ద్వారా పక్షుల విహారాన్ని వీక్షిస్తున్న బడిపిల్లలు


స్కైవాక్ బ్రిడ్జ్


స్కైవాక్ బ్రిడ్జ్


పార్కు ప్రవేశద్వారం

చుట్టూ పచ్చదనంతో ఆకర్షణీయమైన క్రీడా ప్రాంతం, కాలిబాట, పర్ణశాలలతో ఈ ఉద్యానవనం నేత్రపర్వంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఉద్యానవరం వాచ్ టవర్, విజిటర్స్ స్పాట్, విజటర్స్ టవర్, కాలినడక దారి, క్యాంటిన్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, చిన్న చిన్న వంతెనలు, నిఘా గోపురాలు, చిల్డ్రన్స్ ప్లే ఏరియా ఇలా సరికొత్త అందాలతో కనువిందుచేస్తోంది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో తొల్‌కాప్పియ పూంగా సైట్-1, సైట్-2ను అనుసంధానం చేసి స్కైవాక్ నిర్మించారు. డాక్టర్ డీజీఎస్ దినకరన్ రహదారికి అడ్డంగా ఉన్న నీటి కాలువకు ప్రత్యామ్నాయంగా మూడు దారుల పెట్టె వంటి కాలువ (ట్రిపుల్ సెల్ బాక్స్ కల్వర్ట్) కూడా నిర్మించారు. ఈ ఉద్యానవనంలోని వాచ్ టవర్ నుండి అడయార్ నదికిరువైపులా ఉన్న చెట్లను తిలకించడానికి వీలుంది. అంతే కాకుండా బైనాక్యులర్ స్పాట్ కూడా ఉండటంతో అడయార్ నదిపై రోజూ ఉదయం, సాయంత్రం విహరించే అందమైన పక్షులను కూడా వీక్షించడానికి వీలుంది. ఈ ఉద్యానవనంలో బాలబాలికలను, బడిపిల్లలను ఆకట్టుకునే అందమైన స్పాట్‌లు కూడా ఉన్నాయి. రాతితో, సిమెంట్ మిశ్రమాలతో తయారు చేసిన జంతువులు బొమ్మలు కూడా సందర్శకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ ఉద్యానవనం రాజా అన్నామలైపురం, ఎంఆర్‌సీ నగర్, మందవెల్లి, అడయార్, పట్టినంబాక్కం, మైలాపూరు ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ప్రత్యేకపర్యాటక ప్రాంతంగా తయారైంది.


బాలల క్రీడా ప్రాంతం

ఎన్నెల్సీ చైర్మన్‌కు అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారం

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ అధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లిని 'ఆక్ట్ నౌ' సంస్థ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఆదివారం నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి వేడుకల సందర్భంగా ఈ అవార్డును అందజేసింది. ఎన్నెల్సీ సంస్థ అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్ విశిష్ట సేవలందిస్తూ దార్శనిక నాయకత్వం వహిస్తుండటాన్ని ప్రశంసిస్తూ ఆక్ట్ నౌ సంస్థ ఈ పురస్కారంతో ఘనంగా సత్కరించింది. ప్రసన్నకుమార్ చురుకైన నాయకత్వం కారణంగా, ఎన్నెల్సీలో పునరుత్పాదక ఇంధన విస్తరణ, స్థిరమైన పారిశ్రామికాభివద్ధి, సాంకేతిక పరివర్తనలో అద్భుతమైన పురోగతిని సాధించిందని సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆక్ట్ నౌ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నెల్సీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మోటుపల్లిని పురస్కారంతో సత్కరిస్తున్న 'ఆక్ట్ నౌ' సంస్థ నిర్వాహకులు


తిరువిక నగర్ కపిలర్ వీధిలో నిర్మిస్తున్న చెన్నై మాధ్యమిక పాఠశాల భవన సముదాయాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

తిరువిక నగర్‌లో రూ.42.60 కోట్లతో అభివృద్ధి పనులు

●మంత్రి శేఖర్‌బాబు పరిశీలన

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గం పరిధిలోని తిరువిక నగర్ జోన్‌లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) సంయుక్తంగా రూ.42.60 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి పీకే శేఖర్‌బాబు ఆదివారం ఉదయం పరిశీలించారు. కపిలర్‌వీధిలో రూ.4.63 కోట్లతో నిర్మిస్తున్న చెన్నై (కార్పొరేషన్) మాధ్యమిక పాఠశాల భవనం, శీనివాసనగర్‌లో రూ.3.25 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన తనిఖీ చేశారు. జీకేఎం కాలనీ జంబులింగం మెయిన్‌రోడ్డులో ప్రభుత్వ ఆదర్శ మహోన్నత పాఠశాలలో సీఎండీఏ ఆధ్వర్యంలో రూ. 14.95 కోట్లతో నిర్మించనున్న పాఠశాల స్థలాన్ని పరిశీలించారు. జీకేఎం కాలనీ మెయిన్‌రోడ్డు జంబులింగం రోడ్డు వద్ద కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.19.77 కోట్లతో నిర్మిస్తున్న పార్కింగ్ ఏరియాను కూడా ఆయన తనిఖీ చేశారు. మంత్రితోపాటు జీసీసీ మేయర్ ప్రియ, సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ హెచ్‌ఆర్ కౌశిక్, జోనల్ కమిటీ అధ్యక్షురాలు సరితా మహేష్‌కుమార్, కార్పొరేటర్ ఎ. నాగరాజన్ శ్రీధని తదితరులు పర్యటించారు.


జ్యోతిమలర్

థాయ్‌లాండ్ అందాల పోటీలకు
రామనాథపురం యువతి

అడయార్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లో నవంబరు 28 నుంచి జరుగనున్న 'మిస్ హెరిటేజ్ ఇంటర్నేషనల్ 2025' అందాల పోటీలకు రామనాథపురం జిల్లాకు చెందిన రైతు కుమార్తె ఎంపికైంది. రామనాథపురం జిల్లా ముదుకుళత్తూర్ దక్షిణ కక్కూర్ ప్రాంతానికి చెందిన రైతు గజేంద్ర బాబు కుమార్తె జ్యోతిమలర్ (28) బీటెక్ పూర్తిచేసి బెంగళూరులోని ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తూ మోడలింగ్ కూడా చేస్తుంటుంది. ఇటీవల పూనేలో జరిగిన 'మిస్ టూరిజం అంబాసిడర్ హెరిటేజ్ ఇండియా' పోటీల్లో జ్యోతిమలర్ పాల్గొన్నారు. వంద మంది పాల్గొన్న ఈ పోటీల్లో జ్యోతిమలర్ 'మిస్ టూరిజం అంబాసిడర్ హెరిటేజ్ ఇండియా 2025'గా ఎంపికయ్యారు. ఈ క్రమంలో, నవంబరు 28న థాయ్‌లాండ్‌లో జరుగనున్న 'మిస్ హెరిటేజ్ ఇంటర్నేషనల్-2025' అందాల పోటీల్లో భారత్ తరఫున పాల్గొనేందుకు జ్యోతిమలర్ ఎంపికైంది. ఈ విషయమై జ్యోతిమలర్ మాట్లాడుతూ... ప్రపంచ దేశాల మధ్య శాంతి, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి ప్రోత్సహించే లక్ష్యంతో మిస్ హెరిటేజ్ పోటీని థాయ్‌లాండ్ నిర్వహిస్తుందని, ఈ పోటీల్లో భారత దేశం తరఫున పాల్గొనడం ఆనందంగా, గౌరవంగా ఉందన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ సాంప్రదాయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రదర్శించే అవకాశం లభించడం నాకు గర్వంగా ఉందని జ్యోతిమలర్ తెలిపారు.



విద్యార్థులకు సహాయాలను పంపిణీ చేస్తున్న జీవీ సెల్వం - జీవీ సెల్వంను సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు

ఘనంగా వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జన్మదిన వేడుకలు

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వం జన్మదిన వేడుకలు ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎస్ స్నేహితుల గ్రూప్ ఆధ్వర్యంలో వేలూరు సమీపంలోని తోటపాళయంలో పేద మహిళలకు సెల్వం ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అనంతరం చెట్లు నాటారు. వేలూరు సతువాచారి ప్రభుత్వ పాఠశాల హాస్టల్ విద్యార్థులకు సంక్షేమ సహాయాలను సెల్వం-అనూష దంపతులు అందజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా రెడ్‌క్రాస్ సంఘం కార్యాలయంలో సెల్వంను ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌కుమార్, కుమరన్ ఆస్పత్రి మేనేజర్ శ్రీనివాసన్, భరణిధరన్, మణివన్నన్ సహా జీవీఎస్ స్నేహితుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

నాగై-శ్రీలంక ప్యాసింజర్ నౌక సేవలు నిలిపివేత

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం-శ్రీలంక మధ్య నడుపుతున్న ప్యాసింజర్ నౌకా సేవలు ఆదివారం నుంచి నిలిపివేశారు. నాగ పట్టణం-శ్రీలంక కాంగేశం హార్బర్‌కు 2023 అక్టోబరు 14న ప్యాసింజర్ నౌకా సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నౌకలో ప్రతిరోజు పర్యాటకులు, వ్యాపారులు, విదేశీయులు పర్యటిస్తున్నారు. ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభించడంతో వారంలో అన్ని రోజులు ఈ సేవలను పొడిగించారు. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాల కారణంగా సముద్రంలో బలమైన గాలులు వీస్తుండడంతో, ఆదివారం నుంచి డిసెంబరు వరకు నిలిపివేస్తున్నట్లు నౌకా సంస్థ అధికారులు తెలిపారు.

కావేరి హాస్పిటల్‌లో 33 ఏళ్ల మహిళకు తుంటి ఎముక శస్త్రచికిత్స

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో తుంటి ఎముక విరిగి బాధపడుతున్న 33 యేళ్ళ మహిళకు ఓ-ఆర్మ్ ఇమేజింగ్ టెక్నాలజీ ఉపయోగించి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సింగారవడివేలు తెలిపారు. ఓ-ఆర్మ్ సిస్టమ్స్ ద్వారా విరిగిన ఎముక భాగాలను మూడింతల పరిమాణంలో వీక్షించి శస్త్రచికిత్సల చేయగలమని ఆయన తెలిపారు. ఎముకలకు సంబంధించి సంక్లిష్టమైన చికిత్సను ఈ సాంకేతిక పరిజ్ఞానంతో అందించటం వల్ల రోగులు వీలయినంత త్వరగా కోలుకుని, మునుపటిలా నడవగలుగుతారని ఆయన వివరించారు.

దూరవిద్య సర్టిఫికెట్లతో కళాశాలల్లో అడ్మిషన్లు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దూరవిద్య సర్టిఫికెట్‌తో కళాశాలల్లో చేరవచ్చని అఖిల భారత సాంకేతిక విద్యా కౌన్సిల్ (ఏఐసీటీఈ) ప్రకటించింది. అన్ని సాంకేతిక విద్య కళాశాలలకు ఏఐసీటీఈ పంపిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఉన్నత విద్యాసంస్థలు, ఎన్ఐఓఎస్ అనే జాతీయ దూరవిద్యలో చదివిన వారు ఉన్నత విద్యలో చేరేందుకు అనుమతించలేదనే ఫిర్యాదులు న్నాయని తెలిపింది. జాతీయ దూరవిద్య కేంద్ర విద్యా శాఖ అనుమతి పొందిన స్వయం ప్రతిపత్తి సంస్థ అని తెలిపింది. అందువల్ల అన్ని విద్యా సంస్థలు జాతీయ దూరవిద్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి విద్యార్హతను బట్టి ఉన్నత విద్యలో అడ్మిషన్లు కల్పించాలని ఏఐసీటీఈ సర్క్యులర్‌లో తెలిపింది.

శ్రీలంక ఖైదీలకు చికిత్స అందించాలి

● జైళ్లశాఖకు హైకోర్టు ఆదేశం

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న శ్రీలంక ఖైదీలకు తగిన వైద్యం అందించాలని రాష్ట్ర జైళ్ల శాఖకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. శ్రీలంకకు చెందిన తనకారోషన్‌ను గత సంవత్సరం అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఆమె తరుపున మద్రాస్ హైకోర్టులో దాఖలు దాఖలైన పిటిషన్‌లో పుళల్ జైలులో 30మందికి పైగా శ్రీలంకకు చెందిన ఖైదీలను ఒకే గదిలో బంధించారని, తమ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. జైలులో తమకు నాణ్యతలేని ఆహారాన్ని ఇస్తున్నారని, ఇందువల్ల పలువురు అనారోగ్యానికి గురైనా వైద్యం అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని తెలిపారు. శనివారం హైకోర్టు న్యాయమూర్తులు ఎన్.సతీష్‌కుమార్, జస్టిస్ ఎం.జ్యోతిరామన్‌తో కూడిన ధర్మాసనం ముందుకు పిటిషన్ విచారణకు వచ్చింది. పిటిషనర్ తరుపున న్యాయవాది ఎస్.నదియా, జైళ్లశాఖ తరుపున న్యాయవాది గోకుల్ కృష్ణ హాజరై వాదించారు. ఇరుతరుపు వాదనల అనంతరం శ్రీలంక ఖైదీలకు నాణ్యమైన ఆహారంతో పాటు వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేశారు.

ఎంపీ తంబిదురైకు అస్వస్థత

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఎంపీ అస్వస్థతకు గురయ్యారు. కృష్ణగిరికి చెందిన తంబిదురై కరూర్ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన అన్నాడీఎంకే ప్రచార కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు నేతలు, కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు ఆయన పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన హఠాత్తుగా అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీంతో, ఆయనను శనివారం థౌజండ్ లైట్స్ సమీపంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

మళ్లీ అదృశ్యమైన బాలిక !

అడయార్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భోజనం చేసిన తర్వాత చేతులు కడుక్కుంటానని చెప్పి వెళ్లిన బాలిక, తప్పించుకోవడంతో పోలీసులు గాలిస్తున్నారు. కృష్ణగిరి జిల్లా హోసూరు బస్టాండ్‌లో 16 ఏళ్ల బాలిక అనుమానాస్పదంగా సంచరిస్తుండడాన్ని గమనించిన కొందరు ప్రయాణికులు హోసూరు మహిళా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాలికను అదుపులోకి తీసుకుని విచారణ జరపగా, ఆ బాలిక, చెన్నై కొరట్టూర్ ప్రాంతానికి చెందినదని, పది రోజుల క్రితం ఆమె అదృశ్య కావడంపై బాలిక తండ్రి ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుసుకున్నారు. ఆ విషయమై బాలిక తండ్రికి పోలీసులు సమాచారం ఇవ్వగా, కొరట్టూరు పోలీసులతో కలసి బాలిక తండ్రి హోసూరు బయల్దేరాడు. ఈ క్రమంలో, పోలీస్ స్టేషన్ భోజనం చేసిన బాలిక, చేతులు శుభ్రం చేసుకు వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన పోలీసులు ఆమె ఆ చూకీ కోసం గాలిస్తున్నారు.

ఎట్టకేలకు పూర్తయిన రోడ్డు నిర్మాణం

తిరుత్తణి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని 10వ వార్డులో మరమ్మతులకు గురైన రోడ్లను బాగుచేయాలన్న ప్రజల విజ్ఞప్తుల మేరకు ఆ వార్డు డీఎంకే కౌన్సిలర్ జయమ్మ గత ఏడాది నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం రోడ్డు నిర్మాణం పనులు పూర్తికావడంతో ఆమె రోడ్డుపై టెంకాయకొట్టి నూతన రోడ్డును లాంఛనంగా ప్రారంభించారు. దీనిపై ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జయమ్మ కుమారుడు పద్మనాభన్, రోడ్డు కాంట్రాక్టర్ దివాకరన్, డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.



పళ్లిపట్టు 10వ డివిజన్‌లోని రోడ్డు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'ఆసాన్' పురస్కారాల ప్రదానం

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3233, డిస్ట్రిక్ట్ ఒకేషనల్ సర్వీసెస్ టీం సంయుక్త ఆధ్వర్యంలో 'ఆసాన్' పురస్కారాల ప్రదానోత్సవం శనివారం సాయంత్రం జరిగింది. ఎగ్మూర్‌లోని ఎతిరాజ్ కాలేజ్ ఫర్ ఉమెన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిస్ట్రిక్ట్ ఒకేషనల్ సర్వీసెస్ చైర్మెన్ ఎస్.నెవిల్ పి.రాయన్ మాట్లాడుతూ... వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని గౌరవించేలా గత ఏడాది నుంచి 'ఆసాన్' పురస్కారాలు అంది స్తున్నామన్నారు. రెండో ఏడాది కూడా విద్యారంగంలో రాణిస్తూ, విద్యార్థుల భవితకు మార్గదర్శకులుగా నిలిచిన 112 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందిస్తున్నామన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 70 మంది, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు న్నారని తెలిపారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉన్నత విద్యా శాఖ మంత్రి కోవి చెళియన్, పురస్కార గ్రహీతలకు జ్ఞాపికలు అందజేసి అభినందిం చారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఎత్తిరాజ్ కాలేజ్ ఫర్ ఉమెన్ చైర్మన్ డా.వీఎం మురళీధరన్, ప్రత్యేక ఆహ్వానితులుగా సినీ నటుడు డాక్టర్ దాము, ఆసార్ పురస్కారాల కమిటీ చైర్మన్ షబీర్ నజీర్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.దేవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న ఉన్నత విద్యా శాఖ మంత్రి చెళియన్

నేత్రపర్వంగా సిక్కల్ సింగారవేలర్ రథోత్సవం

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా సిక్కల్ ప్రాంతంలోని శింగారవేలర్ ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు ఈ నెల 22న భక్తుల కంకణధారణతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో రోజూ కుమారస్వామి వివిధ వాహనాల్లో ఊరేగుతున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైంది. సుబ్రహ్మణ్యస్వామి సర్వాలంకరణశోభితులై వళ్ళి దేవసేన సమేతుడై రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత ఆలయ నిర్వాహకులు, భక్తులు కలిసి రథం తాడు పట్టుకుని లాగుతూ వెళ్లారు. ఆలయ చతుర్మాడ వీధుల్లో ఊరేగిన తర్వాత మధ్యాహ్నం రెండు గంటలకు రథమండపానికి తిరగొచ్చింది. ఈ రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి ఆలయంలోని వేల్‌కన్ని అమ్మవారి వద్ద శూరసంహారం కోసం కుమారస్వామి వేలా (శూలా)యుధాన్ని స్వీకరించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్‌లో ఆదివారం జరిగిన దీపావళి వేడుకల్లో పాల్గొన్న చెన్నైకి చెందిన తెలుగు ప్రముఖులు మన్నూరు చలపతి కుటుంబ సభ్యులు.



ఆసియా యువజన క్రీడోత్సవాల్లో

స్వర్ణపతకాలు సాధించిన కబడ్డీ క్రీడాకారులకు నగదు పురస్కారం

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బహ్రయిన్‌లో జరిగిన తృతీయ ఆసియా యువజన క్రీడోత్సవాల్లో స్వర్ణ పతకాలు సాధించిన రాష్ట్రానికి చెందిన ఇద్దరు కబడ్డీ క్రీడాకారులకు ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ తరఫున నగదు కానుకను ఆదివారం అందజేశారు. బహ్రెయిన్ రిబ్బానగరం ఈసా స్పోర్ట్స్ సిటీలో ఈ నెల 19 నుండి 23 వరకు తృతీయ ఆసియా క్రీడాపోటీలు జరిగాయి. ఆ పోటీల్లో తొలిసారి కబడ్డీ చేర్చారు. ఈ పోటీలల్లో ఏడు దేశాలకు చెందిన కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. బాలుర జట్టు తరఫున పాల్గొన్న తిరువారూరుకు చెందిన అభినేష్ మోహన్‌దాస్, బాలికల జట్టు తరఫున చెన్నై కన్నగినగర్‌కు చెందిన కార్తీక స్వర్ణపతకాలు గెలుచుకుని స్వదేశానికి తిరిగొచ్చారు. ఈ సందర్భంగా చెన్నై క్యాంపు కార్యాలయంలో వీరిరికి ముఖ్యమంత్రి స్టాలిన్ తలా రూ.25 లక్షల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి మంత్రిత్వ శాఖలను కూడా నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథరెడ్డి, కోచ్‌లు ఎం. రాజేష్, ఎం.నాగరాజన్, క్రీడాకారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారులు కార్తీక, అభినేష్‌లకు చెక్కులు అందజేస్తున్న సీఎం స్టాలిన్

గ్రూప్-4 పరీక్షల్లో ఫెయిల్

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పరీక్షలో ఫెయిల్ కావడంతో, వేర్వేరు ప్రాంతాల్లో మహిళ సహా ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెన్‌కాశి జిల్లా ముప్పులియూర్ శివాలయం వీధికి చెందిన రవిచంద్రన్ కుమార్తె రూప (21) ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాస్తోంది. ఈ నేపథ్యంలో జూలైలో నిర్వహించిన గ్రూప్-4 పరీక్షను రూప రాసింది. వాటి ఫలితాలు ఇటీవల విడుదల కాగా, రూప తక్కువ మార్కులు పొందింది. దీంతో, మనస్తాపం చెందిన ఆమె శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు ఆమెను కడయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికత్స ఫలించక రూప మృతిచెందింది.

మదురైలో...

మదురై ఆనయూర్ ముడకత్తాన్ ప్రాంతానికి చెందిన సెల్వం కుమారుడు చంద్రు (21) ఇంజనీరింగ్ పూర్తిచేసి టీఎన్‌పీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో, గ్రూప్-4 పరీక్ష రాసిన చంద్రు ప్రభుత్వ ఉద్యోగం తప్పకుండా వస్తుందనే నమ్మకంతో ఉన్నాడు. కానీ, పరీక్షా ఫలితాలు విడుదలైన తరవాత చంద్రు తక్కువ మార్కులు సాధించాడు. మనస్తాపం చెందిన చంద్రు, శనివారం తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆయా ప్రాంతాల పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

టీచర్, హెచ్‌ఎం అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు, అతడికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు కటకటాల పాలయ్యారు. తంజావూరు జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో భాస్కర్ (53) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం భాస్కర్, ఐదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని, తరగతి గదిలో నిల్చుని చదవమని, ఆమె చదువుతుండగా భాస్కరన్ లైంగిక వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పగా వారు హెచ్‌ఎం విజయకు ఫిర్యాదుచేశారు. హెచ్‌ఎం ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. అలాగే పట్టుకోట మహిళా పోలీస్ స్టేషన్‌లో టీచర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు భాస్కర్‌ను విచారించగా అతడు మరో ఆరుగురు విద్యార్థినులపై కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు, ఈ విషయమై ఆ బాలికల తల్లిదండ్రులు హెచ్‌ఎం విజయకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విచారణలో తెలిసింది. ఈ వ్యవహారంపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, భాస్కర్‌ను ఆయనకు సహకరించిన హెచ్‌ఎం విజయను అరెస్ట్ చేశారు.

7 కిలోల గంజాయి స్వాధీనం ఒకరి అరెస్టు

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా... వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని క్రిస్టియన్‌పేట చెక్‌పోస్టు మీదుగా మద్యం, గంజాయి, గుట్కా తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో ఎస్ఐ ఆనంద్‌కుమార్ నేతృత్వంలోని పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ చిత్తూరు నుండి వేలూరువైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ఆపి తనిఖీ చేయగా, ఓ వ్యక్తి బ్యాగ్‌లో 7 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకుని అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను తిరువణ్ణామలైకు చెందిన రంజిత్‌కుమార్ (45)గా పోలీసులు గుర్తించారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు రంజిత్‌కుమార్

● కరూర్ దుర్ఘటన..

టీవీకే నేతలపై సీబీఐ కేసు నమోదు

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సంభవించిన తొక్కిసలాటపై విచారణ చేపట్టిన సీబీఐ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, సంయుక్త కార్యదర్శి నిర్మల్‌కుమార్, కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మదియళగన్‌లపై కేసు నమోదు చేసింది. కరూర్ వేలుచామిపురంలో గత నెల 27వ తేది టీవీకే అధ్యక్షుడు విజయ్ రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా, 110 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని సీబీఐ బృందం ఈ నెల 17వ తేదీ కరూర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఐజీ ఆశ్రా గార్గ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం, సుప్రీంకోర్టు ఉత్తర్వులతో కేసుకు సంబంధించిన 1,316 పేజీల విచారణ నివేదికను సీబీఐకి అప్పగించింది. మరుసటిరోజు సీబీఐ బృందం, వేలుచామిపురంలో దర్యాప్తు చేపట్టింది. టీవీకే కార్యకర్తలు చెట్టుపై పడినట్లు తేలడంతో అటవీశాఖ నుంచి రికార్డులు స్వాధీనం చేసుకుని, వారిని విచారించింది. ఈ క్రమంలో 23వ తేదీ విచారణ ప్రారంభించిన సీబీఐ బృందం, మృతుల కుటుంబ సభ్యులు, క్షత గాత్రులు, పోలీసు అధికారులు, అంబులెన్స్ డ్రైవర్లు సహా పలువురిని విచారించింది. అనంతరం సీబీఐ తరుఫున కరూర్ కోర్టులో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ నకలు కోరుతూ టీవీకే తరుపు న్యాయవాదులు శనివారం కోర్టులో పిటిషన్ వేసి ఎఫ్ఐఆర్ నకలు పొందారు. అందులో బుస్సీఆనంద్ సహా ముగ్గురిపై ఐదు సెక్షన్లలో కేసు నమోదైనట్లు సమాచారం.

పళ్లిపట్టులో విద్యార్థి అదృశ్యం

తిరుత్తణి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కొత్తకుప్పం గ్రామంలో విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. ఆ గ్రామానికి చెందిన ధర్మయ్య కుమారుడు షణ్ముగం (17) అత్తిమాంజేరిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతున్నాడు. శనివారం పోస్టాఫీసుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు షణ్ముగం ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కాలువలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వాలాజా సమీపంలో కాలువలో గల్లంతైన చెన్నై యువకుడు సహా ఇద్దరి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. రాణిపేట జిల్లా మనపాక్కం ప్రాంతానికి చెందిన మణికంఠన్ (21) చెన్నై ఒరగడంలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడితో పాటు చెన్నై తిరువొత్తియూర్‌కు చెందిన అరుణ్ (23), కావేరిపాక్కంకు చెందిన గాంధీనాధన్, విఘ్నేష్, సుభాష్, సెంథిల్, దినకరన్, తమిళన్‌సామువేల్, కాంచీపురానికి చెందిన శామ్‌సెల్వరాజ్ పనిచేస్తున్నారు. శనివారం కంపెనీకి సెలవు కావడంతో, వీరంతా వాలాజా పాలారు నదికి విహారయాత్రకు వెళ్లారు. నది నుంచి సమీపంలోని చెరువు నీరు వెళ్లే కాలువలో మణికంఠన్, అరుణ్ స్నానం చేస్తుండగా, మిగిలిన వారు ఒడ్డున వంట చేస్తున్నారు. ఆ సమయంలో ఊహించని విధంగా కాలువలో నీటి ప్రవాహం అధికమై, మణికంఠన్, అరుణ్ కొట్టుకుపోయారు. వారిని రక్షించేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న రాణిపేట జిల్లా అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గల్లంతైన ఇద్దరి కోసం రాత్రి వరకు గాలించారు. ఆదివారం కూడా గాలింపు కొనసాగించగా, ఇరువురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.





అరుణ్, మణికంఠన్ (ఫైల్‌ఫొటోలు)

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. తిరునల్వేలి జిల్లా నాంగునేరి ప్రాంతానికి చెందిన సెల్వకుమార్ (59) గత ఏడాది జూలై 17న ఐదేళ్ల బాలికను ఒడిలో కూర్చోబెట్టుకుని లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆ బాలిక పెద్దగా కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న బాలిక తల్లి అక్కడకు రావడంతో, బాలికను కింద పడేసిన సెల్వకుమార్, అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, అతడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు తిరునల్వేలి పోక్సో కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సెల్వకుమార్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సురేష్‌కుమార్ తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికకు రూ.3 లక్షలు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు.

తిరుచ్చి జైలు తొట్టెలో పడి ఖైదీ మృతి

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి కేంద్ర కారాగారం ప్రాంగణంలోని తొట్టిలో మునిగి ఖైదీ మృతిచెందాడు. పెరంబలూరు జిల్లాకు చెందిన సుభిన్‌కుమార్ (19) పెరంబలూరు టౌన్, తిరుచ్చి కేకే నగర్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో కోర్టు శిక్ష విధంచగా జనవరి 2 నుంచి తిరుచ్చి కేంద్ర కారాగారంలో ఉన్నాడు. సుభిన్‌కుమార్ మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో, ఘటన జరిగిన రోజు జైలు ప్రాంగణంలోని టాయిలెట్ సమీపంలో ఉన్న తొట్టె సమీపంలో కూర్చున్న సుభిన్‌కుమార్ హఠాత్తుగా మూర్ఛ వచ్చి నీటి తొట్టెలో పడిపోయాడు. జైలు అధికారులు అతడిని తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తిరుచ్చి కేకే నగర్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లావ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని మొందిరమేడు గ్రామానికి వెళ్లే మార్గంలోని వాగు నిండి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా ఆ గ్రామం సమీపంలోని పిచ్చాట్టూరు చెరువులో నీటిని విడుదల చేయడంతో గ్రామంలోకి వరదనీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొవలసివస్తుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ, గ్రామ శివారులోని వాగుపై వంతెన లేనందువల్ల వాగుపై తాడు సాయంతో అవతలవైపు వెళ్లాల్సివస్తుందన్నారు. వాగుపై వంతెన నిర్మించి ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తాడు సాయంతో వాగు దాటుతున్న గ్రామస్తులు

మొలకెత్తిన పంట: ట్రాక్టర్‌తో దున్నించిన కౌలు రైతు

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళుల ధాన్యాగారంగా పేరొందిన తంజావూరు జిల్లాలో ఈశాన్య రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప వాయుపీడనం కారణంగా వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట వాననీటిలో తడిసి మెలకెత్తింది.. అప్పులు చేసి, ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంట తమ కళ్లెదుటే తడిసి ముద్దయి మొలకెత్తడాన్ని చూసి అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. ఈ క్రమంలో తంజావూరు జిల్లా తిరువయ్యారు సమీపం మేల్‌తిరుపరుందుత్తి గ్రామానికి చెందిన రవి, విజీ అనే రైతు దంపతులు నాలుగెకరాల పొలాన్ని లీజుకు తీసుకుని వరిపంట వేశారు. 15 రోజులకు ముందే పంట కోతకు వచ్చింది. ఆలోగా కుండపోతగా వర్షం కురవడంతో వరికంకులు మొలకెత్తసాగాయి. ఇక ఆ పంటను ఎవరూ కొనటానికి ముందుకు రారని ఆ రైతు కూలీ దంపతులు ట్రాక్టర్‌తో మొలకలెత్తిన పంటను దున్నించారు. ఈ విషయమై రైతు కూలీ విజీ మాట్లాడుతూ నాలుగెకరాల భూమి లీజుకు తీసుకుని అప్పోసొప్పో చేసి వరి వేసినట్లు తెలిపారు. నూటికి మూడు శాతం వడ్డీతో అప్పులు తెచ్చి పండించా. తీరా వాన దెబ్బతీసిందని వాపోయాడు.



పంటను ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న కౌలు రైతు దంపతులు రవి, విజీ

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

● అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

● డీపీఐ అధ్యక్షుడు తిరుమా డిమాండ్



ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే వారం నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రారంభించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించిన నేపథ్యంలో, దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను మరోవారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపిందని, గతంలో బిహార్‌లో నిర్వహించిన ఎస్ఆర్‌లో పలు అవకతవకలు జరిగాయని, మతవాద పార్టీలను వ్యతిరేకిస్తున్న దళితులు, ముస్లింలు లక్షలాది మందిని ఓటర్ జాబితా నుండి తొలగించిన కారణం గురించి ఇప్పటి వరకు ఈసీ వివరణ ఇవ్వలేదన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైయ్యాయని, ఈనేపథ్యంలో, రాష్ట్రంలో ఎస్ఐఆర్ చర్యలు ప్రారంభంకాక ముందే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సీఎం స్టాలిన్‌ను తిరుమావళవన్ డిమాండ్ చేశారు.

ప్రియురాలి మృతి: యువకుడి ఆత్మహత్య


పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమికురాలి మృతిని తట్టుకోలేని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. పింజనూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు నరేన్ కార్తీక్ (20) కోవైలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కార్తీక్ తల్లి నెల రోజుల క్రితం మృతిచెందింది. విరుదాచలంకు చెందిన ఓ యువతిని కార్తీక్ ప్రేమిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ యువతి మృతిచెందింది. ఈ వార్త విన్న కార్తీక్ కోవై నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు. ప్రియురాలి మృతి తట్టుకోలేని కార్తీక్ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. మంగళంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతుడు నరేన్ కార్తీక్ (ఫైల్‌ఫొటో)

అబార్షన్ చేసుకోవాలని భర్త వేధింపులు: గర్భిణి ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అబార్షన్ చేయించుకోవాలని భర్త వేధింపులు తట్టుకోలేక గర్భిణీ ఆత్మహత్యకు పాల్పడింది. తిరువణ్ణామలై జిల్లా ఆరణిపాళయంకు చెందిన అశ్వతి (23)కి అదే ప్రాంతానికి చెందిన దివాకర్‌తో వివాహం కాగా ఈ దంపతులకు తియాశ్రీ (2) అనే కుమార్తె ఉంది. ప్రస్తుతం అశ్వతి మూడు నెలల గర్భవతి. ఈ క్రమంలో ఈ నెల 22న అబార్షన్ చేయించుకోవాలని అశ్వతికి తెలిపాడు. అందుకు ఆమె నిరాకరించడంతో భార్యాభర్తల మధ్య వివాదం చెలరేగింది. దీంతో అశ్వతి కన్నవారింటికి వెళ్లింది. శనివారం అత్త ఇంటికి వచ్చిన దివాకర్, అబార్షన్ చేయించుకోవాలని చెప్పినా అంగన్వాడీ కేంద్రంలో గర్భిణిగా పేరు నమోదుచేసుకుంటావా? అంటూ అశ్వతితో ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో తన గదిలోకి వెళ్లిన అశ్వతి చాలాసేపటి వరకు బయటకు రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆమె ఉన్న గది కిటికీ నుంచి చూడగా ఉరేసుకున్న ఆమెను చూసి దిగ్భ్రాంతి చెందారు. ఆరణి టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా అశ్వతికి వివాహమై మూడేళ్లు కావడంతో ఈ వ్యవహారంపై ఆరణి రెవెన్యూ తహసీల్దార్ శివ విచారణ చేపట్టారు.



అశ్వతి (ఫైల్ ఫొటో)